
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 కనిష్ఠం 15.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 14 జనవరి 2024



ఆరు గ్యారంటీలపై కళాజాతా ప్రదర్శన

గుడిహత్నూర్, జనవరి 13: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకంపై శనివారం మండల కేంద్రంలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా కళాకారులు ఆట, పాటలతో ఆరు గ్యారంటీల స్కీంపై, అందులోని ప్రయోజనాలపై స్థానికుల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతీ సారథి జిల్లా టీమ్ కోఆర్డినేటర్ గుంజాల రమేష్, టీమ్ లీడర్ చాకటి రవీందర్, కళాకారులు గట్టు వెంకట్‌రావు, రాజలింగు, మురళీ, శంకర్, రాథోడ్ గోవిందరావు, నగేష్, నర్సమ్మ, ధృక్పథ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



● ఆదిలాబాద్ మార్కెట్‌కు తరలించిన కందులు (ఫైల్)





కందుల కొనుగోళ్లకు.. సన్నద్ధం

- జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పంటలలో పత్తి తర్వాత కంది
- ఈనెల 20వ తేదీ నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు
- మార్కెట్‌లో 'మద్దతు'కు మించిన ధర
- గత పక్షం రోజులుగా రైతుల చేతికి వస్తున్న కంది దిగుబడులు
- కొనుగోళ్ల కోసం గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్న రైతులు
- కంది రైతులకు మంచిరోజులు
- జిల్లావ్యాప్తంగా ఈ యేడాది అధికారిక లెక్కల ప్రకారం 60 వేల ఎకరాల్లో సాగు

ఆదిలాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి పంట తర్వాత కంది పంటను కూడా రైతులు అధికంగానే సాగు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 60 వేల ఎకరాలలో కంది పంట సాగైనట్లు వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో 3లక్షల 60వేల క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత పక్షం రోజుల క్రితం నుంచే కంది పంట చేతికొచ్చింది. దీంతో పంట నూర్పిడి చేసుకున్న రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకుని కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు అత్యవసరాల పేరిట దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. పండుగకు ముందే కొనుగోళ్లను ప్రారంభించాల్సి ఉండగా.. కొంత ఆలస్యంగా కొనుగోళ్ల ప్రారంభిస్తున్నారు. ఈనెల 20 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందులను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో అంతర్ పంటగానే కాకుండా విడి గా పంటను సాగు చేశారు. దీంతో ఎకరాన 6క్వింటాళ్ల నుంచి 8క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే దిగుబడులు భారీగా తగ్గాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానా ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. దిగుబడుల మాట ఎలా ఉన్నా ఈసారి మద్దతును మించిన ధర పలకడంతో కంది రైతులకు ఇక మంచి రోజులే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వాణిజ్య కొనుగోళ్లకు ఏర్పాట్లు

ఈసారి కంది పంటకు మదతును మించిన ధర పలుకడంతో మార్క్‌ఫెడ్ వాణిజ్య కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు కాగా బయట మార్కెట్‌లో రూ.7500 నుంచి రూ.8వేల వరకు ధర పలుకుతుంది. దీంతో మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు పంట దిగుబడులు రావడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధర ఎక్కువగా ఉండడంతో రైతులు బయట మార్కెట్‌లోనే కందులను విక్రయించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ప్రైవేట్ దళారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల నుంచి కందులను సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా సేకరించిన కందులను టోకున మార్క్‌ఫెడ్‌కు విక్రయించేందుకు అవకాశం ఉందంటున్నారు. రైతుల అవసరం మేరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే ప్రయోజనం ఉంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలోని జైనథ్, ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. జాతీయ మార్కెట్‌లో కందులకు మంచి డిమాండ్ ఉండడంతో మార్క్‌ఫెడ్ కూడా వాణిజ్య కొనుగోళ్లకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

మద్దతు ధర రూ.7వేలు

గతేడు ప్రభుత్వ మద్ధతు ధర రూ.6300 ఉండగా.. ఈసారి రూ.7వేల మద్దతుధరను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈధర కూడా ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన చీడపీడలు ఆశించి దిగుబడులు రాక నష్టపోవాల్సి వచ్చిందని రైతు లు వాపోతున్నారు. క్వింటాలుకు రూ.10వేల వరకు ఉంటేనే గిట్టుబాటు అయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే నిబంధనల ప్రకారమే కందులను కొనుగోళ్ల చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కందులను అమ్మే సమయంలో రైతులు కొన్ని గుర్తింపు నకల్ జిరాక్స్ పత్రాలను మార్కెట్ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు సాగు చేసిన భూమి వివరాలను తప్పనిసరిగా తెలపాల్సి ఉంటుంది. ప్రతియేటా కొందరు దళారులు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కందులను కొనుగోలు చేసి జిల్లా మార్కెట్‌కు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. దీని పూర్తిస్థాయిలో అరికట్టడంలో అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. పంటను సకాలంలో కొనుగోలు చేయక పోవడంతో కొంతమంది కంది రైతులకే మద్దతుధర దక్కడం గమనార్హం.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
: శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి



ఈయేడు కందులకు మంచి డిమాండ్ ఉంది. దళారుల మాటలు నమ్మి ఆదర బాదరగా అమ్మేసుకోవద్దు. మార్క్‌ఫెడ్ వాణిజ్య కొనుగోళ్లను చేపట్టే అవకాశం ఉంది. దీంతో బయట మార్కెట్‌లో ఉన్న ధరనే చెల్లించే అవకాశం ఉంటుంది. ఈనెల 20 నుంచి కందులను కొనుగోళ్లు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరకే రైతులు అమ్ముకోవాలి. నాణ్యత పేరిట ధరలో కోతలు విధిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఎస్పీని కలిసిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 13: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ఆలంను జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. వారిలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి, జైనథ్ మండల నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, బేల మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాక్లె, మైనార్టీ నాయకులు ఎంఎ షకీల్, క్రాప్రీ సర్పంచ్ ఎల్టి ప్రమీల వెంకట్‌రెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచ్ భోజారెడ్డి, ఏనుగు అశోక్‌రెడ్డి, అల్లూరి అశోక్‌రెడ్డి, శంకర్‌భోగ్రె, అస్బాత్‌ఖాన్, తదితరులున్నారు.

ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జైనథ్, జనవరి 13: రాష్ట్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థిని విద్యార్థులు 2024-25 సంవత్సరానికి గాను ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని జైనథ్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జావిద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రవేశానికి చేరే విద్యార్థుల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులను ఏప్రిల్ 7వ తేదీ నుంచి జనవరి 12 నుంచి ఫిబ్రవరి నెల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఆరవ తరగతిలో వంద సీట్లు మిగిలిన 7, 8, 9వ తరగతుల విద్యార్థుల సీట్లను వెకన్సి ఆధారంగా పూర్తి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జావిద్ అహ్మద్ పేర్కొన్నారు.

ముగిసిన దరఖాస్తుల ఆన్‌లైన్

తలమడుగు, జనవరి13: లబ్ధిదారుల కోసం అభివృద్ధి పథకాలను అందించేందుకు ఇటీవల చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీ ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేశామని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత వారం రోజులుగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలు చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి లబ్ధిదారులకు నష్టం జరగకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల గాను 11,717 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని ఆయా శాఖల అధికారుల సహకారంతో పూర్తి చేశామన్నారు. దరఖాస్తులు కొన్ని తప్పులు లబ్ధిదారులు రాయడంతో నేరుగా లబ్ధిదారులకు ఫోన్ చేసి సరి చేశామన్నారు. ఇందులో ఎంపీడీవో రమాకాంత్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో దిలీప్ కుమార్, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

● జిల్లా నూతన ఎస్పీ గౌష్ఆలం ఐపీఎస్ ● ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 13: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అవలంభించనున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ఆలం తెలిపారు. శనివారం స్థానిక ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అధ్యక్షతన జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రధానంగా జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో గతంలో జరిగిన ఆర్థిక నేరాలు కొనుగొనడంలో, తగ్గించడానికి సరైన పద్ధతిలో పరిశోధన నిర్వహించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని త్వరితగతిన నేరస్తులను పట్టుకునే విధంగా తమ కార్యాచరణలను అవలంభించాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో గంజాయి పండిస్తే చర్యలు తప్పవని అవగాహన కల్పిస్తూ గంజాయి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా అసాంఘీక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని వాటిని నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జరిగిన ప్రధాన శాంతి భద్రతలు, తదితర సమస్యలపై సిబ్బందితో చర్చించారు. పోలీసు వ్యవస్థ ఒక ఉన్నతమైన వ్యవస్థ అని, పోలీసు స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి చేయాలని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో పరిశుభ్రతను పాటిస్తూ 5ఎస్ విధానాన్ని అవలంభించాలని సూచించారు. అదేవిధంగా కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ సైబర్ నేరగాళ్లు అవలంభిస్తున్న నూతన విధానాలను ప్రజలకు తెలిపి చైతన్య పరచాలన్నారు. ఇందులో డీఎస్పీలు సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, సైదరావు, ప్రేమ్‌కుమార్, భీమేశ్, చంద్రశేఖర్, కోళ్ల నరేష్‌కుమార్, జె.కృష్ణమూర్తి, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రణయ్‌కుమార్, జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌష్ఆలం

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చాలి : డీటీఎఫ్ డిమాండ్

ఉట్నూర్, జనవరి 13: సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వృకోధర్, శ్రీనివాస్, శుద్ధోదన్, కిషోర్, రాజేందర్‌లతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కరువయ్యాయని, కనీసం పాఠశాలలో ఊడ్చడానికి స్కావెంజర్లు కూడా లేరని అన్నారు. ఇది వరకు పని చేసిన స్కావెంజర్లను పునరుద్ధరించి ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లను నియమించాలని, అదే మాదిరి ప్రతి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్లను నియమించాలన్నారు. డీఈవో నుంచి డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు అందరూ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే పీజీహెచ్ఎంలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇందులో సంఘం ప్రతినిధులు ముడుగు శామ్యూల్, సి.వీరయ్య, గజానంద్, దేవరావు, తదితరులు పాల్గొన్నారు.

"హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దు"

తలమడుగు, జనవరి 13: హెల్మెట్ లేకుండా ఎవరు కూడా ద్విచక్ర వాహనాలు నడపవద్దని తలమడుగు ఏఎస్సై సురేందర్ తెలిపారు. శనివారం మండలంలోని అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాలు తనిఖీ చేసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు మండలంలోని అంతర్రాష్ట్ర రహదారి పై ఏఎస్సై సురేందర్‌కౌన్సిలింగ్ నిర్వహించి హెల్మెట్ లేకుంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అలాంటప్పుడు కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉన్నందున ప్రతి వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలుపడం జరిగింది. అలాగే పోలీసులు అంటే ప్రజల ప్రాణాలుకాపాడే విషయంలోనే ఫైన్లు వేస్తారు తప్ప మాకేమి శత్రువులు కదని కాబట్టి భద్రత నియమాలు పాటిస్తూ పోలీసు సిబ్బందికి సహకరించాలని వాహనదారులను ఆయన కోరారు.



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

నేరడిగొండ, జనవరి 13: మండలకేంద్రంలో నిర్వహించిన జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలలో ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌జాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నందున సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు ఏసహాయం కావాలన్న అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి ఎంపికైన ఆరుగురు క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సద్దాం సురేందర్, కేజీబీవీ ఎస్‌వో రజిత, సాఫ్ట్‌బాల్ అసోసియేట్ జిల్లా సెక్రటరీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఓదార్పు

ఉట్నూర్, జనవరి 13: 'నేనున్నాను, అధైర్య పడకండి' అంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ బాధిత కుటుంబాన్ని ఓదార్చడం ఆయన మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది. శనివారం ఖానాపూర్ ప్రాంతంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించి తిరుగు ప్రయాణంలో ఉన్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మార్గమధ్యలో ఆటోలో వెళ్తున్న ఓ బాధితున్ని కాలులేక పట్టితో కనిపించడంతో వాహనాన్ని ఆపి బాధిత కుటుంబ సభ్యులతో విషయం తెలుసుకున్నారు. దస్తురాబాద్ మండలానికి చెందిన నాగచైతన్య అనే బాలుడు విద్యుదాఘాతానికి గురై కాలు కోల్పోయిన సంగతి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దు, కృత్రిమ కాలు పెట్టిద్దాం అంటూ హామీ ఇచ్చారు. ఆసుపత్రికి ఖర్చు అయిన ఖర్చునీన్ని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా అందేలా చూసి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



పురాతన నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

నాగోబా జాతరకు శ్రీకారం

● నెలవంకకు మెస్రం వంశీయుల ప్రత్యేక పూజలు
● నేడు నాగోబా ప్రచార యాత్ర ప్రారంభం
● పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు

ఇంద్రవెల్లి, జనవరి 13: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న నిర్వహించే నాగోబా మహాపూజ (జాతర)కు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి కేస్లాపూర్ గ్రామంలోని పురాతన నాగోబా ఆలయం (మురాడి)లో ప్రత్యేక పూజలు నిర్వహించి నెలవంకను చూసి మొక్కుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేస్లాపూర్ గ్రామంలోని పురాతన నాగోబా ఆలయం (మురాడి) వద్ద సంప్రదాయం ప్రకారం ఏర్పాటు చేసిన గాది వద్ద మెస్రం వంశీయులు కూర్చొని నాగోబా మహాపూజ, నాగోబా జాతర, ఆదివారం ప్రారంభించే జాతర ప్రచార యాత్రలపై చర్చించారు. ఆదివారం నాగోబా ప్రచార యాత్రను ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం చిన్ను పటేల్, కటోడ మెస్రం కోసేరావు, ప్రధాన్ మెస్రం దాదారావు, మెస్రం వంశీయులు, మెస్రం బాదిరావు, మెస్రం లింబారావు, మెస్రం కోసు, మెస్రం హనుమంత రావు, మెస్రం తుకారం, మెస్రం తిరుపతి, మెస్రం నాగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా గోదాదేవి కల్యాణం

బోథ్, జనవరి 13: మండలంలోని కుచలాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కళ్యాణాన్ని కన్నుల పండుగ వేద పండితులు పండరీ రమేష్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావడంతో వచ్చిన వారికి తక్కల సునీల్‌రెడ్డి, దంపతులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ఉట్నూర్, జనవరి 13: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలకేంద్రంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలలో సీనియర్‌విభాగం నుంచి ఎస్.ధనలక్ష్మి మొదటిబహుమతి, డి.శ్రీలత రెండ బహుమతి, ఆర్.నందిని మూడవ బహుమతిలకు ఎంపికయ్యారు. అదేవిధంగా సబ్ జూనియర్ విభాగం నుంచి గుమ్మల చైత్ర మొదటి బహుమతి, జి.శృతి రెండవ బహుమతి, ఆడేపూజ మూడవ బహుమతిలకు ఎంపిక కాగా జూనియర్ విభాగం నుంచి బి.సాత్విక మొదటి బహుమతి, సెద్మకి శ్రీనిది రెండవ బహుమతి, ఎస్.రమ్య మూడవ బహుమతిలకు ఎంపికయ్యారని తెలిపారు. న్యాయనిర్ణేతలుగా జాదవ్‌సుమన్‌బాయి,సావిత్రి, పొదిలఅనిత, మహేశ్వ రిల తో పాటు వీహెచ్‌పీ నాయకులు సాడిగె రాజగోపాల్, రామిని నాగన్న, ఏలేటి తిరుపతిరెడ్డి, షికారి శ్రీనివాస్, గొల్లపల్లి శ్రీనివాస్, కొండేరి రమేష్, బోదిగమ రాములు, డి.శ్రీనివాస్, వినోద్, సంతోష్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


హీరా సుక్కు చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

'హీరా సుక్క జయంతి ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి'

ఇంద్రవెల్లి, జనవరి 13: ఫిబ్రవరి 26న గోండి ధర్మ గురు హీరాసుక్క జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని, ఉత్సవాలను జరుపుకునేందుకు సహకరించాలని ఉట్నూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌లో ముందుగా గోండి ధర్మ గురు హీరాసుక్క చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివాసీ ద్రాన్ సంఘాల ఉమ్మడి జిల్లా నాయకులతో గోండి ధర్మ గురు హీరాసుక్క జయంతి ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరాసుక్క చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అంతేకాకుండా జాతి ఉన్నతి, వారి చరిత్రను గురించి రాబోయే తరాల వారికి తెలిసే విధంగా కార్యక్రమాలను చేపడుతామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జయంతి వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్కా ఖమ్ము, జిల్లా నాయకులు మడావి శంకర్, ఆడా నగేష్, మరప గోవిందరావు, మండల అధ్యక్షుడు గేడం భారత్, ప్రధాన కార్యదర్శి తోడసం సాగర్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు సోయం రాందాస్, నాయకులు పెందోర్ అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం : రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 13: ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు ముందుకు వచ్చి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. శనివారం రిమ్స్‌లోని బ్లడ్ బ్యాంక్‌కు ఆదిత్య కండేష్కర్ సొసైటీ రాంగోపాల్ సంయుక్త రక్తదాన చైర్లను అందించారు. సొసైటీ నాలుగు, గోపాల్ రెండు చైర్లను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్‌కు సహకారం అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మరింత మంది సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్‌రాథోడ్, ఏకేఎస్ చైర్మన్ ఆదిత్య ఖండేష్కర్, అనిల్ లోకండే, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


జీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న కాలనీ వాసులు

'ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 13: రామజన్మభూమి అయోధ్యలో పునర్ నిర్మితమైన భవ్య శ్రీరామ మందిరంలో ఈనెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీరంగం మన్నార్ గుడి పీఠాధిపతి శండాలంకార రామనుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. అయోధ్యలో నిర్వహించే బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి బయలుదేరి వెళ్తూ శనివారం ఆయన ఆదిలాబాద్‌లో కొద్దిసేపు బస చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, మహిళలు ఆయనకు స్థానిక కోదండ రామాలయంలో విడిది ఏర్పాటు చేయగా.. వారంతా మంగళవాయిద్యాలు నడుమ స్వామి వారిని స్వాగతించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు బాలరామ ప్రతిష్ఠ కార్యక్రమ గొప్పదనాన్ని వివరించారు. ప్రతి ఇంటికి రామ జెండాను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించిన ఆయన ఈ సందర్భంగా భక్తులకు జెండాలు రాముడి చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ అయోధ్యలో రామ ప్రతిష్ఠ పట్టాభిషేకం చూడగలడం ప్రజలంతా ఎన్నోజన్మల పుణ్యంగా భావించాలన్నారు. ఈనెల 17నుంచి అయోధ్యలో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయని ఆయన వివరించారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వర కట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్ లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
» రైలు పట్టాలపై పడిన గాలి పటం
» నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.


ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

రంగవల్లులు సంస్కృతికి చిహ్నం

ఇంద్రవెల్లి, జనవరి 13: రంగవల్లులు మన సంస్కృతికి చిహ్నమని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అందుగూడ గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్గొండ గ్రామ సర్పంచ్ కినక జుగదిరావు, ఏఎన్ఎం విజయసుందరి, ఉప సర్పంచ్ సేడ్మె పులాబాయి, ఏకలవ్య ఫౌండేషన్ సభ్యులు దిగంబర్, భీంరావు, ముత్యం, శంకర్, తదితరులు ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బోథ్, జనవరి 13: మండలంలోని పొట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రాన్ని పులాజీబాబా కుమారుడైన కేశవ్ ఇంగ్లే దాదా చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, ధ్యానంతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. ధ్యానం ఆరోగ్యానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంద్రం సుగుణ శంకర్, యూత్ అధ్యక్షులు నరక లక్ష్మణ్, ఆడం పుల్లన్న, న్యాయవాది శంకర్, యూత్ అధ్యక్షులు నరక లక్ష్మణ్, ఆడం పుల్లన్న, న్యాయవాది శంకర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాది రావు, కడప విజయ్, లింగు, జ్ఞానోబా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కొల్హారిలో ఒకరిపై హత్యాయత్నం

గుడిహత్నూర్, జనవరి 13: మండలంలోని కొల్హారి గ్రామ శివారులో శనివారం బెదాడే శంకర్(55) అనే వ్యక్తిపై ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నం చేశారు. ఉదయం మేకలు మేపేందుకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు శంకర్ చేతిలో ఉన్న గొడ్డలి లాక్కొని ఆయన మెడ మరియు వీపుపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు. గాయపడ్డ వ్యక్తి భార్య అనసూయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని అనుమానితుల గురించి ఆరా తీస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

భీంపూర్, జనవరి 13: ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన అనార్పు గణపతి(51) అనే రైతు కూలీ గత కొన్ని రోజులుగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కాగా పలు చోట్ల చికిత్స పొందిన నయకం కాక పోవడంతో శనివారం సాయంత్రం తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

పల్లె గూటికి పండుగొచ్చింది

● నేటి నుంచి సంక్రాంతి సంబురాలు
● పిండి వంటల తయారీలో మహిళలు
● గ్రామాల్లో సన్నాయి మోతలు, గంగిరెద్దుల విన్యాసాలు


● గ్రామాల్లో గంగిరెద్దుల సందడి, పిండివంటల తయారీ





ముథోల్, జనవరి 13: పల్లెకు పండుగొచ్చింది. నులివెచ్చని చలి మంటలు, ముత్యాలను తలపించే అందమైన ముగ్గులు గొబ్బెమ్మలు, ఎగిరే గాలి పటాలు, పిండి వంటలు, డుడు బసవన్నల విన్యాసాలు హరిదాసు కీర్తనలు ఇవన్నీ కలగలుపుగా వచ్చే పండుగ సంక్రాంతి. కొత్త కాంతుల్లో పయానం సంకాంత్రి నుంచే మొదలవుతుంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతి ధనుర్మాసం పూర్తయి సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరం వైపు తిరిగే ఉత్తరాయణ పుణ్యకాలమే సంక్రాంతి. మార్గశిర పుష్యమాసాల సంధి కాలంలోని హేమంత రుతువులో వచ్చే ఈ పండుగను తొలిరోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి, మూడవ రోజు కనుమ పండువలుగా జరుపుకుంటారు.

● మొదటి రోజున భోగి

మూడు రోజుల పండుగల్లో భాగంగా మొదటి రోజు భోగి జరుపుకుంటారు. ఈ రోజున మంటల్లో కట్టెలు, పిడకలను కాల్చి భోగి మంట వేస్తారు. ఇది మనలోని అసూయ, ద్వేషాలను దహనం చేసి జ్ఞానం అనే వెలుగును పొందాలన్నదే సందేశం.

● మకర రాశిలోకి సూర్యుడు

రెండవ రోజున మకర సంక్రాంతి. ఈ రోజున సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తాడు. మకర రాశి అధిపతి శని, శనివాత ప్రధాన గ్రహమని జ్యోతిష్య శాస్త్రం పేర్కొంటున్నది. వాతం అంటే నూనే లాంటి ద్రవ్యాలని అర్థం. వాతం, కుస్మాండం(గుమ్మడికాయ) వంటి కాయాలతో తగ్గుతుంది. అందుకే ఈ రోజున తెలకపిండి నలుగుతో స్నానం చేసి శనిని కొలిచి నువ్వులు, గుమ్మడి కాయాలను దానం చేస్తారు. పితృ దేవతల పుణ్యలోక ప్రాప్తికి తర్పణం చేస్తారు. అలాగే మహిళలు ఉపవాస దీక్ష బూని నోముల కార్యక్రమం నిర్వహిస్తారు. రైతుల గృహలు ధాన్య రాశులతో కళకళలాడుతుంటాయి. మకర సంక్రాంతి రోజున ఇంటి మధ్య చుట్టూ నాలుగు పిడత (కుండ)లను మధ్యలో ఒక పిడత పెట్టి అందులో కొత్తబియ్యం పోసి పొంగే ఆవు పిడకలతో మండిస్తారు.

● పశువుల బండ్లకు అలంకరణ

మూడవ రోజు పశువులను బండ్లను అలంకరించి గోప్రదర్శన చేయిస్తారు. గంగలమ్మ, పోలేరమ్మ, వంటి గ్రామ దేవతలకు నైవేద్యంను సమర్పిస్తారు. కనుమ పండుగ నాడు మినుము తినాలి అనే సాంప్రదాయం ఉంది. ఆ రోజున పౌరానిక పాత్రలు ధరించి అభినహిస్తూ గృహస్తులు సమర్పించే కానుకలను, కళాకారులను స్వీకరించి దీవిస్తారు. అనంతరం గౌరీ వ్రతాలు, బొమ్మల నోము పెడతారు.

● నోరూరించే పిండి వంటలు

సంక్రాంతి పండుగ అంటేనే నోరూరించే పిండి వంటకాలకు ప్రత్యేకం. ముఖ్యంగా ఈ పండుగకు సకినాలు, గారేలు, నువ్వుల లడ్డులు, చేసుకోవడం ఆనవాయితీ. పండుగకు వారం రోజుల నుండి పిండి వంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. సకినాల తయారీ ఒక కళ. ఇవి చేయడం అందరికీ రావు. సంక్రాంతికి వారం రోజుల నుంచి మహిళలు ఒకరి ఇంటికి ఒకరు వెళ్లి సకినాలు చేయాడానికి సహయ పడుతారు. అలాగే గారేలు, నోరూరించే బెల్లపు అరిసెలు, చురుకులు, గరిజెలు, చేయడంతో పాటు మూడు రోజుల పాటు రంగురంగుల రంగవల్లులు వేస్తారు. అంతేకాకుండా ఏ పల్లె చూసినా సంక్రాంతి సంబురాలతో బంధువుల రాకతో ప్రతీ ఇల్లు కళకళలాడుతూ ఉంటుంది.

గాలిపటాలు ఎగరవేసేటప్పుడు జాగ్రత్త సుమా!!

సంక్రాంతికి ప్రత్యేకంగా గాలిపటాలను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తుంది. అయితే పిల్లలు గాలిపటాలను ఎగరవేసేటప్పుడు పెద్దలు గమనించాలి. పిట్టగోడలు, ఎత్తైన డాబాలు, విద్యుత్ తీగాలు ఉన్న చోట ఎగరవేయకుండా చూడాలి. ముఖ్యంగా మాంజదారం వాడకుండా చూడాలి. విశాలమైన స్థలంలో ఎగరవేసే విధంగా చూడాలి.

● పతంగుల వేడుకల్లో పిల్లలు

సంక్రాంతి రోజు పెద్దలు పిండివంటల తయారీలో నిమగ్నమైతే పిల్లలు పతంగులను ఎగరవేస్తూ ఆనందోత్సహల నడుమ గడుపుతారు. కాలానికి అనుగుణంగా వివిధ రంగుల్లో, ఆకృతుల్లో వస్తున్న గాలిపటాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మార్కెట్‌లో గాలిపటాలు రూ. 5 నుండి 100 రూపాయాల వరకు అందుబాటులో ఉన్నాయి.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది : ఎమ్మెల్యే


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బోథ్, జనవరి 13: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా ఎంతో ఉపయోగపడుతాయని, అంతేగాక క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోచ్చార గ్రామంలో మద్దెల అనిల్‌కుమార్ స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను స్నేహపూరిత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయిన వారు బాధపడవద్దని రేపటి గెలుపు కోసం ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఓటమి రేపటి విజయానికి నింది కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త ఏలేటి అశ్విన్‌రెడ్డి నానమ్మ ఇటీవలే స్వర్గస్థురాలవగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ శనివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్‌సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సద్దాం, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జైనథ్, జనవరి 13: మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన అరసుల మోహన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న శనివారం దీపాయిగూడ గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, జైనథ్ ఎంపీపీ గోవర్ధన్, జైనథ్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మద్దుల ఊశన్న, దీపాయిగూడ గ్రామ సర్పంచ్ బొల్లి గంగన్నలతో పాటు దీపాయిగూడ గ్రామ ప్రజలున్నారు.

తలమడుగు: మండలంలో బరంపూర్ గ్రామానికి చెందిన మేకల మధుకర్ సోదరుడు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం జడ్పీటీసీ గణేష్‌రెడ్డి పరామర్శించారు. అదేవిధంగా పెండల్‌వాడ గ్రామానికి చెందిన సుగ్యంవిఠల్ అల్లుడు మరణించడంతో అర్లి(కె) గ్రామానికి చెందిన కంది నర్సారెడ్డి మరణించడంతో వారి అంత్యక్రియల్లో పాల్గొని రుయ్యాడి గ్రామానికి చెందిన నిమ్మల సుదర్శన్‌రెడ్డికి ప్రమాదం జరగడంతో బరంపూర్ గ్రామానికి చెందిన బొల్లరపు వామన్ కూతురు అనారోగ్యంతో బాధపడడంతో హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం చేసి వీరి కుటుంబాలని పరామర్శించిన జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, బీఆర్ఎస్ అధ్యక్షుడు మేకల మల్లన్న, ఎంపీటీసీలు వెంకన్న, రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తరుపతి, తదితరులు పాల్గొన్నారు.



కాల్వ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న జడ్పీ చైర్మన్

దిలావర్‌పూర్, జనవరి 13 : జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి శనివారం కాల్వ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఉజరం మహేష్ జడ్పీ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డైరెక్టర్ నర్సయ్య, మాజీ చైర్మన్ చిన్నయ్య, అర్చకులు వెంకటేష్, శ్రీనివాస్, రాము, తదితరులున్నారు.



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న అప్పటి మంత్రి కేటీఆర్

లాప్‌టాప్‌లు సరే
కంప్యూటర్‌లు ఏవీ ?



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి

సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ట్రిపుల్ ఐటీలో 18 నెలలుగా కంప్యూటర్‌ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు
- హామీలు తప్ప.. వసతులు కల్పించని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- విద్యార్థులు ఆందోళన చేసిన సమయంలో హామీ ఇచ్చి.. మరిచిపోయిన అధికారులు
- విద్యాసంవత్సరం చివరి దశకు వచ్చినా ఇంకా అందని యూనిఫాంలు
- వచ్చిన నిధులు వసతులకు కాకుండా పక్కదారి

బాసర, జనవరి, 13 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. విద్యార్థుల వసతి సౌకర్యాలపై అధికారులు హామీలు, ప్రకటనలు తప్ప విద్యార్థులకు మేలు జరిగేది గోరంత మాత్రమే. సమస్యల పరిష్కారం కోసం 18 నెలల క్రిందట విద్యార్థులు ఆందోళన చేసిన సమయంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఇచ్చిన హామీలు నేటికి నెరవేరలేదు. హామీల్లో ముఖ్యమైన ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల అందజేత హామీ అసంపూర్తిగానే మిగిలిపోయింది. విడతల వారీగా నెలల తరబడి జాప్యం చేస్తూ ఎట్టకేలకు ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసినప్పటికీ మరో 3 వేల మంది విద్యార్థులకు అవసరమయ్యే కంప్యూటర్‌లను అధికారులు సమకూర్చలేదు. అధికారులు పలుమార్లు విన్నవించినప్పటికీ వారు పట్టించు కోవడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ కంటే ముందు ఇక్కడ చేరిన విద్యార్థులు పీయూసీ -1, పీయూసీ -2 కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుంది. గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు ప్రవేశం పొందే యూనివర్సిటీలో కంప్యూటర్ల వినియోగంపై అవగాహన పెంచేందుకు పీయూసీ-1, పీయూసీ-2 లో కంప్యూటర్ కోర్సు ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేస్తేనే ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ వినియోగం, ఇతర ఐటీ కోర్సులను చదివేందుకు సులువుగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టారు.

రెండేళ్లుగా కంప్యూటర్‌లు లేకుండానే విద్యాబోధన

గతంలో రెండేళ్ల క్రిందటి వరకు పీయూసీ-1, పీయూసీ -2 విద్యార్థులకు యూనివర్సిటీలో ప్రవేశం పొందిన సమయంలోనే ల్యాప్‌టాప్‌లను అందించేవారు. ఇవే ల్యాప్‌టాప్‌లను యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యే వరకు వినియోగించుకునేవారు. కాని ప్రస్తుతం ఉన్న వైస్ చాన్స్‌లర్ పీయూసీ-1, పీయూసీ-2 విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అవసరం లేదు. డెస్కటాప్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే సరిపోతుందని, ల్యాప్‌టాప్‌ల పంపిణీ పద్ధతిని నిలిపివేశారు. పోని అధికారులు చెప్పినట్టు డెస్కట్యాప్‌లనైనా ఏర్పాటు చేశారా అంటే అది జరగలేదు. ల్యాబ్‌ల కోసం యూనివర్సిటీలో భవనాలు చూస్తున్నాం. సిద్దం చేస్తున్నాం.. త్వరలోనే ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామంటూ పదేపదే అధికారులు ప్రకటనలు చేస్తున్నారు తప్ప విద్యార్థులకు మాత్రం కంప్యూటర్‌ల ల్యాబ్‌లు ఏర్పాటు జరగలేదు. ఇలా 3 వేల మంది విద్యార్థులు రెండేళ్ల నుంచి కంప్యూటర్ కోర్సు తరగతులు, ప్రాక్టికల్ తరగతులకు దూరమవుతున్నారు. ప్రభుత్వం ఏ ఉద్దేశ్యంతోనైతే గ్రామీణ విద్యార్థులకు కింది స్థాయి నుంచి ఉన్నతమైన సాంకేతిక విద్యను అందించేలా చూడాలనే ప్రభుత్వ సంకల్పం మాత్రం గత రెండేళ్ల నుంచి అమలు కావడం లేదు.

నిధులు పక్కదారి

గత ఏడాది జూన్ నెలలో విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేశారు. వారం రోజుల పాటు తరగతులను బహిష్కరించి నిరసన చేపట్టడంతో అప్పటి మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి వంటి ప్రభుత్వ పెద్దలు పలుమార్లు వచ్చి హామీలిచ్చి వెళ్లారు. ఆ తర్వాత నుంచి ప్రభుత్వం నుంచి రూ.కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. రూ.కోట్లు వచ్చినప్పటికీ విద్యార్థులకు అవసమైన వసతి సౌకర్యాలు మాత్రం అందక ఆ సమస్యల తోనే విద్యార్థులు కొట్టు మిట్టాడుతున్నారు. వచ్చిన నిధులను విద్యార్థులకు ప్రాధాన్యత పరంగా కాకుండా అనవసర ఖర్చు లకు వినియోగించారనే విమర్శలు యూనివర్సిటీలో వినిపి స్తున్నాయి. ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులకు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు యూనిఫామ్స్ అందివ్వలేదంటే ఇక్కడ పరిస్థితి ఏందో అర్థం చేసుకోవచ్చు. ఒక యూనిఫాంలే కాదు కొత్తగా చేరే విద్యార్థులకు అందివ్వాల్సిన ఇతర వస్తు వులను అధికారులు సమకూర్చలేదు. విద్యార్థులు చెప్పిన సమస్యల్లో సింహభాగం అపరిష్కృతంగానే మిగిలిపోయాయి.

వీసీ రెగ్యులరైనా అంతేనా ?

2022 జూన్ నెలలో విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన సమయంలో అప్పటి ప్రభుత్వం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న వెంకట రమణను బాసర ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. రాష్ట్రస్థాయి కీలకమైన పదవిలో ఉన్న ఆయన మొదటి నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి సరియైన సమయం కేటాయించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హాస్టల్ వసతితో కూడిన 9 వేల మంది విద్యార్థులు చదువు కుంటున్న ఈ యూనివర్సిటీలో రెగ్యులర్ వీసీతో పాటు ఆయన స్థానికంగా ఉండాల్సిన అవసరం ఉంది. నిత్యం ఏదో ఒక సమస్యతో యూనివర్సిటీలో వివాదం ఏర్పడుతూనే ఉంది. వివాదాలు చెలరేగిన రోజులు, అత్యవసరమైతే తప్ప మిగితా రోజుల్లో వైస్ చాన్సలర్ ట్రిపుల్ ఐటీకి రారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల సమస్యల తెలుసుకునే ఉన్న తాధికారులు ఇక్కడ కరువయ్యారు. ప్రస్తుతం పనిచేస్తున్న డైరెక్టర్ ఆయనకు చెక్ పవర్‌ను వీసీ తొలగించడంతో ఆనాటి నుంచి ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.





'అయోధ్య రామ మందిర' సంబురాలు



పోటీలలో పాల్గొని ముగ్గులు వేస్తున్న మహిళలు

ఖానాపూర్, జనవరి 13 : అయోధ్య నగరంలో రామ మందిర నిర్మాణం నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఐదవ వార్డు పరిధిలో గల ఇంద్రానగర్ కాలనీలో మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కాశవేణి ప్రణయ్ మాట్లాడుతూ... ఈ నెల 21వ తేదీన హిందూ బంధువుల ప్రతి ఇంటింటా కాషాయ జెండాను ఎగరవేస్తామన్నారు. 22వ తేదీన శ్రీరామ జయరామ జయ జయ రామ అనే మంత్రాన్ని 108 సార్లు పారాయణం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ ముగ్గుల పోటీలను మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ పరిశీలించారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేలా రామ మందిర నిర్మాణ ఉత్సవాలలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ బృందాన్ని ఆయన అభినందించారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు కొక్కుల ప్రదీప్, తదితరులున్నారు.

ఎస్పీని కలిసిన ట్రాఫిక్ ఎస్సై



నిర్మల్ కల్చరల్, జనవరి 13 : నిర్మల్ ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సాయి కృష్ణ శనివారం ఎస్పీ జానకి షర్మిలను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. సమ ర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఎస్పీ ఆదేశించారు.

పాక్‌పట్లలో వికసిత్ భారత్

నిర్మల్ కల్చరల్, జనవరి 13 : సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మార గంగారెడ్డి, తదితరులు భారత్ భవిష్యత్‌పై వివరించారు.

డీసీసీని కలిసిన దేవరకోట ఆలయ చైర్మన్

నిర్మల్ కల్చరల్, జనవరి 13 : నిర్మల్ దేవరకోట ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ శనివారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుడు అయ్యన్నగారి శ్రీనివాస్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కన్నుల పండువగా గోదారంగనాథుల కల్యాణం



హరిహర క్షేత్రంలోని రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో కల్యాణం



భైంసాలో కల్యాణోత్సవ వేడుకలకు ముస్తాబైన ఉత్సవ మూర్తులు

నిర్మల్ కల్చరల్, జనవరి 13 : నిర్మల్‌లోని మల్లన్న గుట్ట హరిహర క్షేత్రంలోని రమా సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాథుల కల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు. వికాస తరంగిణి సభ్యులు సహాయ సహకారం అందించగా గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సమీప గ్రామాలు, పట్టణ కేంద్రంలోని భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 14న అయ్యప్ప జ్యోతి దర్శనం, 15న సాయంత్రం 6:45 గంటలకు కర్పూర జ్యోతి నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమాలకు భక్తులు హాజరుకావాలని కోరారు.

ఖానాపూర్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరనలో గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వేద పండితులు చక్రపాణి నరసింహమూర్తి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేకపూజా కార్యక్రమాలు కొనసాగాయి. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు మండల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయానికి హాజరైన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఆలయ కమటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కళ్యాణ అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోదా రంగనాథ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ పార్టీ నేత జాన్సన్‌నాయక్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ సహా పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బొజ్జును, బీఆర్ఎస్ నేత జాన్సన్‌నాయక్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, తదితరులున్నారు.

పెంబి : మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో శనివారం గోదా రంగ నాథుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శైవ క్షేత్ర వనితాశక్తి ఆధ్వర్యంలో ఒడిబియ్యంను గోదా రంగనాథులకు సమర్పించారు. ప్రధాన అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించి, గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమటీ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సల్ల రామేశ్వర్‌రెడ్డి, ఆమెడ శంకర్, పార్వతుల లక్ష్మీనారాయణ, గన్నారపు సురేష్, పుప్పాల నర్సయ్య, రాజలింగు, సుతారి మహేందర్, మోహన్, బచ్చు మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

భైంసా : పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవోపేతంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వేడుకల లో భాగంగా ఆదివారం గోదాదేవి కల్యాణం జరగనుంది. ఇందుకు గాను ఆలయ నిర్వాహణ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టింది. కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గాను ఆలయాన్ని పూలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవ మూర్తులను కల్యాణోత్సవ వేడుకలకు ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి గోదాదేవి కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అచార్య మల్యాల హరిబాబు తెలిపారు. గత నెల ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం నిర్వహి ంచే గోదాదేవి కల్యాణ మహోత్సవముతో ముగియనున్నాయని ఉత్సవ నిర్వహణ కమిటీ పేర్కొంది. ఉత్సవాలలో బాగంగా ప్రతీరోజు నిర్వహించబడుతున్న ప్రవచన కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరవుతున్నారు.



పెంబిలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఖానాపూర్‌లోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం

సంక్షిప్త సమాచారం

అప్పుల బాధతో రైతు మృతి



శ్రీకాంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఖానాపూర్, జనవరి 13 : మండలంలోని చందు నాయక్ తండాలో గుగ్లావత్ శ్రీకాంత్(24) పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రజినీకాంత్ పరిశీలించి తెలిపిన వివరాల ప్రకారం... చందునాయక్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ తనకు ఉన్న 2 ఎకరాల భూమిలో పత్తి పంట వేయగా వర్షాలకు పత్తి పంట దెబ్బ తినడంతో ఆశించినంత దిగుబడి రాక, తన అక్కా చెల్లె పెళ్లి కొరకు అప్పు చేయడంతో అప్పు ఎలా తీర్చాలో బాధతో తాగుడుకి బానిసవ్వడంతో తన భార్య పుట్టింటికి వెళ్లిపోవడం కుంగిపోయి ఎవరు లేని సమయంలో ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో పక్కింటివాళ్లు చూసి వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. మృతుడికి భార్య జమున ఉంది. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంది పంటకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

- రూ. 2 లక్షల వరకు ఆర్థిక నష్టం



కుప్పపోసిన కంది పంట దహనమైన దృశ్యం

ముథోల్, జనవరి 13 : సంవత్సరం పాటు పండించిన పంట రాత్రికి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంట దిగుబడులకు నిప్పు పెట్టడం వలన కౌలు రైతుకు నష్టం వాటిల్లింది. ముథోల్ మండలంలోని తరోడా తండా గ్రామానికి చెందిన ఆడె రాజేష్ అనే కౌలు రైతు తన కంది (తొగరి) పంటను కోసి పొలంలో కుప్పగా వేసి ఉంచారు. దాదాపు రెండెకరాల్లో పండించిన పంటను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి నిప్పంటించారు. దీంతో సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన పంట ఇలా నష్టపోవడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు.

మారువేషంలో దొంగిలించేందుకు యత్నం

ముథోల్, జనవరి 13 : ముథోల్‌లో శనివారం మారువేషంలో ముగ్గురు మహిళలు దొంగతనానికి యత్నించగా స్థానికులు పోలీసులకు పట్టిచ్చారు. స్థానికులు, ముథోల్ ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం ముగ్గురు మహిళలు మారువేషంలో ముథోల్‌లోని బస్టాండ్ సమీపానికి చేరుకొని వృద్ధుల వద్ద నుంచి డబ్బులు దొంగతనం చేసేందుకు యత్నించగా స్థానికులు గమనించి వారిని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- ఖానాపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్ 2 ప్రారంభోత్సవంలో వక్తలు
- పోటీల ప్రారంభోత్సవంలో ఆసక్తికర సన్నివేశం
- ఎమ్మెల్యే బొజ్జు బ్యాటింగ్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ బౌలింగ్

ఖానాపూర్, జనవరి 13 : ఖానాపూర్ ప్రాంతం నుండి యువత జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేలా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆకాంక్షించారు. శనివారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఖానాపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్ 2 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో వారికి కావలసిన సౌకర్యాలను నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, స్థానిక మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్‌లు హాజరయ్యారు. ఈ పోటలకు ప్రధాన స్పాన్సర్‌గా ఎన్నారై పరికిపండ్ల ప్రశాంత్ వ్యవహరించారు. నిర్వాహకులు రాపల్లి రాజు యాదవ్, చిరుత యూత్ బృందం పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఈ క్రికెట్ పోటీలలో 12 జట్లు 7 రోజులపాటు తలపడనున్నట్లు నిర్వాహకులు రాజు యాదవ్ తెలిపారు.

బొజ్జు వర్సెస్ జాన్సన్...

ఖానాపూర్‌లో శనివారం ప్రారంభమైన ఖానాపూర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ 2024 సీజన్ 2 పోటీలలో ఓ ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. గత ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లు పోరాడిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్రికెట్ పోటీల్లో సైతం అలాగే తలపడ్డాయి. క్రికెట్ పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌లు పోటీల ప్రారంభం సందర్భంగా ఒకరు బ్యాటింగ్ మరొకరు బౌలింగ్ చేసేందుకు టాస్ వేశారు. టాస్ గెలిచిన ఎమ్మెల్యే బొజ్జు బ్యాటింగ్ చేయగా జాన్సన్ నాయక్ బౌలింగ్ చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో అధికార ప్రతిపక్షాలు ఎదురైతే వాగ్వాదాలు తలెత్తడం కనిపిస్తుంది. కానీ ఖానాపూర్‌లో మాత్రం ఈ ఇద్దరు యువనేతలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలా స్నేహ పూర్వకంగా ఆటల పోటీల్లో తలపడడం చూసి నేతల పరిణతిని పలువురు కొనియాడుతున్నారు. పోటీల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే బొజ్జు అక్కడి నుండి ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లగా జాన్సన్ నాయక్ మాత్రం యువతతో కలిసి క్రికెట్ ఆడారు. బీఆర్ఎస్ టీం తరపున బరిలోకి దిగిన జాన్సన్ 24 బంతుల్లో 32 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న, శ్రావణ్, తదితరులున్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు వేదికపైన బీఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్